మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 02 | సంచిక : 178 | గురువారం, 27 నవంబర్ 2025



## ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

3 లో

- కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్ ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని






# రేవంత్ రెడ్డి.. అవినీతి అనకొండ

- మున్సిపాలిటీల విలీనం దారుణం
- పాలన చేతకాక అక్రమ కేసులు పెడుతున్నరు
- దీక్షా దివస్ స్ఫూర్తిగా కదం తొక్కుదాం..
- వరంగల్ నుంచే కాంగ్రెస్ సర్కార్‌పై పోరుచేద్దాం..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆయన అన్నదమ్ములు, అనుయాయులతో కలిసి ఓ అవినీతి అనకొండ మాదిరిగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన హెచ్‌ఐఎల్‌టీపీ పాలసీపై ఆయన నిప్పులు చెరిగారు. పరిసర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రతిపాదనపై తీవ్రంగా స్పందించారు. *- వరంగల్ / జనగామ, మన చౌరాస్తా*




# రేవంత్ రెడ్డి.. అవినీతి అనకొండ

- **మున్సిపాలిటీల విలీనం దారుణం**
- **పాలన చేతకాక అక్రమ కేసులు పెడుతున్నరు**
- **దీక్షా దివస్ స్ఫూర్తిగా కదం తొక్కుదాం..**
- **వరంగల్ నుంచే కాంగ్రెస్ సర్కార్‌పై పోరుచేద్దాం..**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**వరంగల్ /జనగామ, మన చౌరాస్తా :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆయన అన్నదమ్ములు, అనుయాయులతో కలిసి ఓ అవినీతి అనకొండ మాదిరిగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన హెచ్‌ఐఎల్‌టీపీ పాలసీపై ఆయన నిప్పులు చెరిగారు. పరిసర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రతిపాదనపై తీవ్రంగా స్పందించారు. బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'మాజీ సీఎం కేసీఆర్ హయాంలో పది జిల్లాల తెలంగాణను 33 జిల్లాలుగా మార్చడం జరిగింది. అదే విధంగా కొత్త రెవెన్యూ డివిజన్లు, కొత్త పురపాలికలు ఏర్పాటు చేశారు. తాండాలను అప్‌గ్రేడ్ చేసి 8,800 గ్రామ పంచాయతీలను 12,800కు పెంచడం జరిగింది. అధికారాన్ని వికేంద్రీకరించి, ప్రభుత్వాన్ని ప్రజల చెంతకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నం చేసింది' అన్నారు.'ఈ విషయంలో ప్రభుత్వం ఎవరితో చర్చించిందో తెలియదు. ఎందుకంటే, మున్సిపాలిటీల్లో ఎలాంటి తీర్మానాలు జరగలేదు. ఏ ఒక్క మున్సిపాలిటీ నుంచి కూడా కనీసం తీర్మానం తీసుకోలేదు. మున్సిపాలిటీలు కొలువు తీరి లేవు కాబట్టి ప్రజలతో నేరుగా అభిప్రాయ సేకరణ చేశారా ? అంటే అదీ చేయలేదు. అఖిల పక్ష సమావేశం పెట్టి అన్ని పార్టీల అభిప్రాయం తీసుకున్నారా ? శాసనసభ పెట్టి సభ్యుల అభిప్రాయం తీసుకున్నారా అంటే అదీ లేదు. మరి ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరి ఎజెండా కోసం, ఎవరి శాశ్వత దీర్ఘకాలిక ఆలోచనల కోసం ఈ ప్రభుత్వం పనిచేస్తుందో మాకైతే తెలియడం లేదు. ఏ కారణం చేత ఈ ప్రతిపాదనను తెచ్చారో కూడా స్పష్టంగా లేదు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, దళారుల ప్రయోజనాల కోసం మాత్రమే ఈ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది' అన్నారు.'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ పేరుతో కొత్త పాలసీని తీసుకువచ్చారు. పరిశ్రమలకు కేటాయించిన భూములు అపార్ట్‌మెంట్లకు ఇస్తున్నారు. గతంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు ప్రజలను ఒప్పించి, ఉపాధి అవకాశాల కోసం భూములను సేకరించిన తీరుగానే, గత ప్రభుత్వాలు హైదరాబాద్ నగరంలో 9,300 ఎకరాల భూమిని పరిశ్రమలకు కేటాయించాయి. కానీ, ప్రస్తుతం ఆ భూముల్లో అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకి భూములు తీసుకొని, వారికి తక్కువ ధర ఇచ్చి, సబ్సిడీపై పరిశ్రమలకు భూములిచ్చిన తర్వాత పరిశ్రమలు నడవాలి. ఉపాధి దొరకాలి. యువతకు ఉద్యోగాలు రావాలి. రాష్ట్ర ఆదాయం పెరగాలని మేము ఆశిస్తున్నాం. రేవంత్ రెడ్డి గారి వైఖరి ఇందుకు విరుద్ధంగా ఉంది. హైదరాబాద్‌లోని పరిశ్రమల యజమానులు వచ్చి,అపార్ట్‌మెంట్లు కట్టుకుంటాం, మాల్స్ కట్టుకుంటాం అంటే.. వారికి అడ్డికి పావుశేరు చొప్పున మార్కెట్ రిజిస్ట్రేషన్ ధరకు కాకుండా కేవలం ప్రభుత్వ రిజిస్ట్రేషన్ వాల్యూలో 30శాతం మాత్రమే చెల్లించి, భూమిని కన్వర్ట్ చేసుకోవడానికి రేవంత్ రెడ్డి అనుమతిస్తున్నాడు' అని ఆరోపించారు. 'హైదరాబాద్, వరంగల్ లాంటి నగరాల్లో పార్కులకు, పార్కింగ్‌లకు, బొందలగడ్డలకు, ఇల్లు కట్టుకోవడానికి జాగా లేదు. వీటికి జాగాలు వద్దట. కానీ, పారిశ్రామికవేత్తలు అడ్డికి పావుశేరుకు కొనుక్కున్న, ప్రభుత్వం ఇచ్చిన భూములను వారు ఇష్టం వచ్చినట్లు అమ్ముకుంటే మాత్రం రేవంత్ రెడ్డి పచ్చజెండా ఊపుతున్నారు. 9,300 ఎకరాల భూమి దాదాపు రూ.5లక్షల కోట్ల విలువైన ఆస్తి. దేశంలోని ఇతర రాష్ట్రాలు (ఉదాహరణకు ముంబయి) మిల్స్ కోసం ఇచ్చిన భూములను 50శాతం వెనక్కి తీసుకొని, ప్రజల అవసరాల కోసం వినియోగిస్తున్నాయి. రేవంత్ రెడ్డి 'అవినీతి అనకొండ' అని.. రేవంత్ రెడ్డి, ఆయన అన్నదమ్ములు, ఆయన అనుయాయులతో కలిసి ఒక అవినీతి అనకొండ మాదిరిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆ అవినీతి అనకొండ విశ్వరూపం ఏమిటంటే..రూ.5 లక్షల కోట్లు విలువైన తెలంగాణ ప్రజల ఆస్తిని దోచుకుపోవడానికి, ఉద్దేశపూర్వకంగా గత ప్రభుత్వాలు పరిశ్రమలకు ఇచ్చిన భూములను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారు' అంటూ ధ్వజమెత్తారు.

## జనగామలో బీఆర్ఎస్ బలంగా ఉంది

జనగామ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయనతో పాటు జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని కడియం శ్రీహరి తరహాలో కాంగ్రెస్ పార్టీలోకి తీసుకెళ్లేందుకు పెద్ద ఎత్తున ఒత్తిడి చేశారని, అయినప్పటికీ ఆయన ఒక్క మాట అన్నారు.. 'నేను నమ్ముకున్న నాయకుడు ఒక్కరే.. ఆ నాయకుడు కేసీఆర్.. ఆయనతోనే ఉంటా.' నిజమైన విధేయత చూపారని అని పల్లాను ప్రశంసించారు. జనగామలో బీఆర్ఎస్ బలంగా ఉందని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటలని పిలుపునిచ్చారు.



## పేదల జీవితాల్లో
# వెలుగు నింపిన కురియన్
### వరల్డ్ మిల్క్ డే సందర్భంగా నివాళులు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భారత శ్వేత విప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ ఎంతోమంది పేదల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపిన మహనీయుడని ముల్కనూరు స్వకృషి మహిళా డైరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ అన్నారు. బుధవారం వరల్డ్ మిల్క్ డే సందర్భంగా ముల్కనూరులోని డైరీ ప్రధాన కార్యాలయంలో కురియన్ చిత్రపటానికి అంజలి ఘటించారు. సహకార పాల ఉత్పత్తి వ్యవస్థల ద్వారా కోట్లాది మంది రైతులు ఆర్థికంగా స్థిరపడేలా చేసిన సేవలు అపురూపమని ఆమె పేర్కొన్నారు. కురియన్ తీసుకొచ్చిన శ్వేత విప్లవం దేశంలో పాల ఉత్పత్తి రంగానికి దిశానిర్దేశం చేసిందని, ఆయన కారణంగానే భారత్ పాల ఉత్పత్తిలో ప్రపంచంలో మొదటి స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో డైరీ జీఎం భాస్కర్ రెడ్డి, సిబ్బంది, పాల సరఫరాదారులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాలోని విశ్వనాథ్ పురం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ బుధవారం పరిశీలించారు. అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ ఆర్డీఓ కార్యాలయంలో భూభారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు, పాడి ప్రోక్యూర్మెంట్ పైన రివ్యూ చేసి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు.

## కమిషనరేట్‌లో రాజ్యాంగ దినోత్సవం





**హనుమకొండ, మన చౌరాస్తా :** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అదనపు డీసీపీ రవి బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలవేశారు. అనంతరం అధికారులు, సిబ్బంది చేత ఆయన రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయుంచారు. అదనపు డీసీపీ మాట్లాడుతూ.. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యమైన మన దేశ రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు వుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, దేశ అభివృద్ధికి కట్టుబడి వుండాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరు గౌరవించాలని సూచించారు. ఏ. ఆర్ అదనపు డీసీపీలు ప్రభాకర్ రావు, బాల స్వామి సురేష్‌కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు జితేందర్ రెడ్డి, జాన్ నర్సింహులు, డేవిడ్ రాజు, నాగయ్య, గిరికుమార్, సురేంద్ర,ఏ. ఓ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

# ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని
- జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్




**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణి కుముదిని పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్ లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయతీలకు 2వ సాధారణ ఎన్నికలను డిసెంబర్ 11న మొదటి విడత, డిసెంబర్ 14న రెండవ విడత, డిసెంబర్ 17న మూడవ విడత పోలింగ్ జరగనున్నట్లు తెలిపారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అప్ డేట్ చేసిన రిజర్వేషన్లు, పోలింగ్దశ, పోలింగ్ కేంద్రాల జియో లోకేషన్ వివరాలు టిపోల్ వెబ్ సైట్ లో నవీకరించాలని తెలిపారు. టిపోల్ వెబ్ సైట్ ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లాలో నోడల్ అధికారిని నియమించాలని, ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే ఫిర్యాదులను మూడు రోజులలో పరిష్కరించాలని అన్నారు. పోలింగ్ క్రేంద్రాల జాబితా, డిజిటల్ వివరాలను టి పోల్ లో నమోదు చేయాలని, పోలింగ్ కేంద్రాలలో లైట్, పవర్, ర్యాంప్, ఫర్నిచర్, భద్రతను చూసుకోవాలని, 2 కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాల్లో ఉన్న భవనం దగ్గర హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, వెబ్ క్యాస్టింగ్ జరిగే పోలింగ్ కేంద్రాల వివరాలు పంపాలని, డిస్ట్రిబ్యుషన్ కేంద్రాలు మండల కేంద్రాలో ఉండాలని, ఓట్ల లెక్కంపు కొరకు స్ట్రాంగ్ రూంలను 3 రోజుల ముందుగా సిద్ధం చేసుకోని ఏర్పాట్లను పర్యవేక్షించుకోవాలని సూచించారు.



## సజావుగా నిర్వహించాలి

### కలెక్టర్ రిజ్వాన్ బాషా

వీసీ అనంతరం ఎన్నికల నిర్వహణ మీద సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ సాఫీగా జరగలన్నారు. ప్రతీ ఒక్కరికి ఎన్నికల నియమ నిబంధనలపై అవగాహన ఉండాలన్నారు. వీసీ లో స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, డి ఆర్డీ ఓ వసంత, ఎక్సైజ్ సూపరిండెంట్ అనిత, జడ్పీ సీఈఓ మాధురి షా నోడల్ ఆఫీసర్ లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.




# కుంగిన రోడ్డును పరిశీలించిన కమిషనర్

జనగామ, మన చౌరాస్తా : జనగామ-హనుమకొండ ప్రధాన రహదారిలో కుంగిపోయిన రోడ్డు బుధవారం కమిషనర్ మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఈ విషయంపై ఆర్టీఏ మెంబర్ చిలువేరు అభి గౌడ్ రెండు రోజు కింద కమిషనర్తో పాటు కలెక్టర్ రిజ్వాన్ బాషాకు విన్నవించారు. దీంతో స్పందించిన అధికారులు రోడ్డు పరిశీలించారు. త్వరలో మరమ్మతులు చేపడుతామని హామీ ఇచ్చారు.



# చేర్యాలలో వైభవంగా సుబ్రహ్మణ్యా స్వామి కల్యాణం

**చేర్యాల, మన చౌరాస్తా :** సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకుని అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ నిర్వహకుల ఆధ్వర్యంలో బుధవారం శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పండితులు దేశపతి చేతన్య శర్మ, ప్రహ్లాద్ వేదమంత్రోచ్చారణల మద్య ప్రత్యేక పూజలు, అర్చన అభిషేక కార్యాక్రమాలను నిర్వహించి ప్రత్యేక వేదిక ద్వారా శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా అయ్యప్ప స్వాములు చేసిన భజన కార్యక్రమంతో ఆలయ ఆవరణ మారుమోగింది. మెదట సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో తీసుకరాగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. సాయంత్రం స్వామికి పట్టాభిషేకం నిర్వహించి సకీర్తన చేశారు. వచ్చిన భక్తులకు తీర్ద ప్రసాదలతో పాటు అన్న ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ నిర్వాహకులు భక్తులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌కు ఘన నివాళి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** 76వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండలంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ముల్కనూరు అంబేద్కర్ చౌరస్తా, కొత్తకొండ గ్రామాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం అట్టడుగు వర్గాల హక్కుల కోసం అంబేద్కర్ గారి అహర్నిశ శ్రమ ఫలితమని తెలిపారు. 2 సంవత్సరాలు 11 నెలలు 18 రోజుల పాటు కఠోర శ్రమతో రాజ్యాంగాన్ని రూపొందించి దేశానికి సమాన హక్కులను ఇచ్చిన మహానుభావుడు అంబేద్కర్ అని ఆయన అన్నారు. అట్టడుగు వర్గాలు శతాబ్దాలుగా ఎదుర్కొన్న సామాజిక అన్యాయాలకు రాజ్యాంగమే పరిష్కారమైందని గుర్తుచేశారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి పౌరుడు బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం అత్యవసరమని చెప్యాల ప్రకాష్ పిలుపునిచ్చారు. యువత రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు సాగితేనే దేశం నిజమైన ప్రజాస్వామ్య దిశగా పయనిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో భీమదేవరపల్లి మండల జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య, హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కండే సుధాకర్, మాడుగుల ఈశ్వరయ్య, మాడుగుల అశోక్, మాడుగుల గోపి, ఎదలాపురం తిరుపతి, రేణుగుంట్ల బిక్షపతి, ఎల్తూరి ప్రేమ్ రాజ్, పెట్టం కుమారస్వామి, కడారి శ్రీనివాస్, గూటం బాబు తదితరులు పాల్గొన్నారు.






# అభివృద్ధి చేసే వ్యక్తికే పట్టం కట్టాలి

**మద్దూరు, మన చౌరాస్తా :** గ్రామాభివృద్ధి కృషిచేసే వ్యక్తులకు పట్టం కట్టాలని కాంగ్రెస్ నాయకులు ఇప్ప నిషికాంత్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మర్మాముల గ్రామంలో పలువురు కాంగ్రెస్ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా నిషికాంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలు బడుగు, బలహీన, పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. గ్రామంలో సర్పంచ్ ఎన్నికకు ఏకగ్రీవానికి కృషి చేస్తే గ్రామానికి తనవంతు సాయంగా రూ.10 లక్షలు ఇస్తానని ప్రకటించారు. ఏకగ్రీవ ఎన్నిక జరిగినట్లయితే ఎంపీ నిధులు గ్రామ అభివృద్ధికి కేటాయిస్తారని నిషికాంత్ రెడ్డి తెలిపారు. పార్టీలో చేరిన వారిలో సుందరగిరి సిద్దయ్య, జాలపెల్లి బాల్ రెడ్డి, గుండ్రెడ్డి మాధవరెడ్డి, గుండ్రెడ్డి నరసింహారెడ్డి, కొండూరి బిక్షపతి, జగ్గని ప్రభాకర్, ఎర్రోజు బిక్షపతి ఉన్నారు.

# బీజేపీ తరపున సర్పంచ్ అభ్యర్థులను బరిలో నిలుపుదాం



**కోహెడ, మన చౌరాస్తా :** పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేసే భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గ్రామ ప్రజలు ఆశీర్వదించాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం కోరారు. కోహెడ గ్రామశాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ అభివృద్ధి, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలు కోసం బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని, కేంద్రమంత్రి బండి సంజయ్ సహకారంతో కోహెడ గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు బీజేపీ సర్పంచ్ అభ్యర్థిని బరిలో నిలబెట్టాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో గ్రామశాఖ బూత్ అధ్యక్షులు ముంజ సాగర్ గౌడ్, జాలిగం అనిల్, గుళ్ల సతీష్, తలారి సుధాకర్, మాజీ ఉపసర్పంచ్ ఖమ్మం రమేష్, మాజీ వార్డు సభ్యులు బండ జగన్ యాదవ్, బొమ్మగాని శివకుమార్ గౌడ్, నరాల శ్రీకాంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# చిన్న సినిమా.. పెద్ద సక్సెస్..

## సెన్సేషన్ క్రియేట్ చేసిన రాజు వెడ్స్ రాంబాయి

అఖిల్ రాజ్, తేజస్వినీ ప్రధాన జంటగా నటించిన 'రాజు వెడ్స్ రాంబాయి' విడుదలైన వెంటనే ప్రేక్షకుల ప్రేమను సంపాదించి, థియేటర్లలో విజయవంతంగా దూసుకుపోతోంది. హృదయాన్ని హత్తుకునే ప్రేమకథగా విమర్శకులు, ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు అందుకుంటోంది. మొదటి రోజు నుంచే మంచి ఓపెనింగ్స్ నమోదవడంతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దృఢమైన స్థాయి సాధించింది. తాజాగా బయటకు వచ్చిన వసూళ్ల సమాచారం ప్రకారం, ఈ సినిమా మొదటి మూడ్రోజుల్లో రూ. 7.28 కోట్లు గ్రాస్ రాబట్టింది. ప్రత్యేకత ఏమిటంటే రోజు రోజుకు కలెక్షన్లు పెరుగుతూ వస్తుండటం. తొలి రోజు కంటే రెండో రోజు, రెండో రోజు కంటే మూడో రోజు కలెక్షన్లు మరింత మెరుగ్గా రావడం చిత్ర విజయాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. డా. నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్‌పై ఈ చిత్రాన్ని వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహించిన ఈ సినిమాను వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ భారీగా థియేటర్లలో విడుదల చేశారు. ఈ చిత్రంలో అఖిల్ రాజ్, తేజస్వినీ రావ్‌తో పాటు శివాజి రాజా, చైతు జొన్నలగడ్డ, అనిత చౌదరి, కవిత శ్రీరంగం తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు.

